మనం





# నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం । 14 । సెప్టెంబర్। 2025 పేజీలు: 6


# బీబీపేటలో యూరియా రసాబాస



- రైతులను పోలీస్ స్టేషన్ కు తరలించి యురియా టోకెన్ల పంపిణీ
- రైతులను పోలీస్ స్టేషన్ కు తరలించడంపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం
- దేశానికి అన్నం పెట్టే రైతులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి నేరస్తులా?
- ముఖ్యమంత్రి చరిత్ర హీనుడిగా మిగిలిపోక తప్పదని హరీష్ రావు ట్వీట్



బీబీపేట్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): రైతుల యూరియా కష్టాలు అంతా ఇంతా కాదని బీబీపేట మండల కేంద్రంలో జరిగిన సంఘటనలు ఉదాహరణగా తీసుకోవచ్చు. బీబీపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం నాలుగు గంటల నుండి క్యూలో నిలబడి యూరియా కోసం ప్రయత్నం చేశారు. అయితే యూరియా విషయం ఆ నోట ఈ నోట బయటకి పొక్కడంతో బీబీపేట రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామల రైతులు పెద్ద ఎత్తున సొసైటీ వద్దకు చేరుకున్నారు. సొసైటీ సీఈఓ నర్సా గౌడ్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీకి సిబ్బంది సిద్ధమయ్యారు. ఒక్క ఉదుటన రైతులు సొసైటీ వద్దకు చేరుకోవడంతో సిబ్బంది వారిని అదుపు చేయలేకపోవడం, వారి తాకిడి తట్టుకోకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రైతులను

-మిగతా 2లో



2

## రైతులకు సరిపడా యూరియా అందజేయాలి

కేసీఆర్ అన్న మాటనే నిజమైంది
రైతుల యూరియా కష్టాలపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రెస్ మీట్

# ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



- అధికారుల నిర్లక్ష్యంతో దేవునిపల్లిలో ఇంటి గోడ కూలిన ఘటన
- 70 రోజులుగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్య
- సీసీ రోడ్డు పనుల్లో ముందుచూపు లేకపోవడమే ప్రధాన కారణం
- ఆరుగురి ప్రాణాలకు తృటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 13(మనం న్యూస్): ఎల్లారెడ్డి పట్టణంలోని నాల్గవ వార్డు పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 70 రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొందనీ స్థానికులు తెలిపారు. డ్రైనేజీలో మురికి నీరు ఎక్కడికక్కడే నిల్వవడంతో అసహన వాతావరణం ఏర్పడింది. నాలుగు కుటుంబాల స్థానికులు ఎవరి ఇంటి దగ్గర వారు ఇబ్బంది తలెత్తకుండా మోరిల్లో మట్టితో కట్టలు వేసుకోవడం దురదృష్టకరమని స్థానిక

-మిగతా 2లో

# ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**



ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్కి, మున్సిపల్ ఏఈ కి సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేసినా పట్టించుకోని వైనం విమర్శలకు దారితీస్తోంది. ముందుచూపు లేకుండా డ్రైనేజీకి అడ్డంగా అధికారులు వేసిన సీసీ రోడ్డు కారణంగా మురుగు నీరు అడ్డంగా నిలిచిపోవడం, భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇబ్బందులకు దారితీస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల వలన నీరు పేరుకుపోయి, దేవునిపల్లి గ్రామానికి చెందిన దుంపల సాయి ప్రకాష్ నివాసముంటున్న ఇంటి బేస్మెంట్ తో పాటు సగం గోడకు పైన భాగానికి తేమ చేరి ఒక మూలన గోడ కూలిపోయిన ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. ఇంటి వెనుకభాగం గోడ కూలడంతో బయటికి మాత్రమే నష్టం జరిగిందని, అదే లోపల కూలి ఉంటే ఇంట్లో నివసిస్తున్న భార్యాభర్తలతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు, అమ్మానాన్న ఇలా మొత్తం ఆరుగురికి ప్రాణాపాయం కలిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తీవ్రంగా మండిపడుతూ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఈ కి ఎన్నిసార్లు చెప్పినా చేస్తాం, చూస్తాం అని మాటలు చెబుతున్నారు కానీ సమస్య మాత్రం పరిష్కారం కాని స్థితి కొనసాగుతోంది. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపోతే, ఇటీవల కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మరో నాలుగు, ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక సందేశం ఇచ్చిన నేపథ్యంలో, ఎప్పుడెప్పుడు మరిన్ని గోడలు కూలిపోతాయోననీ సదరు బాధితుల కుటుంబంలో మరింత భయాన్ని సృష్టిస్తోందనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

# బీబీపేటలో యూరియా రసాభాస



**మొదటి పేజీ తరువాయి**

క్యూ పద్ధతి పాటించి ఎరువులు తీసుకోవాలని నచ్చ చెప్పడానికి ప్రయత్నం చేశారు. పోలీసులను తప్పుపట్టి ఆగ్రహించిన రైతులు పోలీసులపై తీరుపై అసహనం వ్యక్తం చేశారు. దీనిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా స్థానిక ఎస్సై ప్రభాకర్ రైతులందరిని పోలీస్ స్టేషన్ కు తరలించి అక్కడ టోకెన్లు ఇవ్వడం ప్రారంభించారు.

### బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం...

యూరియా పంపిణీ పోలీస్ స్టేషన్ వద్ద జరుగుతుందన్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీపీ పసులాది బాలమని, పోలీస్ స్టేషన్ కు వచ్చి ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఖైదీలా ?అని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను దోపిడిదారులుగా, దొంగలుగా, దోషులుగా, చిత్రీకరించి పోలీస్ స్టేషన్ కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ పార్టీ రైతులపై అక్కసును కక్కుతుందని, రైతు వ్యతిరేకతను ప్రదర్శిస్తుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తిండి తిప్పలు మాని ఒక్క యూరియా బస్తా కోసం వేకువ జామున నుండి సొసైటీ వద్ద పడికాపులు కాస్తే రైతులను నిందితులుగా పోలీస్ స్టేషన్లో కూర్చుండబెట్టడం విడ్డూరంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. శనివారం 660 యూరియా బస్తాలు వస్తే 930 టోకెన్లను పంపిణీ చేసి యూరియా పంపిణీలో సిబ్బంది అవకతలకు పాల్పడ్డారని రైతులు మండిపడ్డారు.

### యూరియా కష్టాలపై హరీష్ రావు ట్వీట్

బీబీపేట రైతుల యూరియా కష్టాలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రైతులను పోలీసు స్టేషన్ కి తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేసి స్పందించారు. 'భూమి కోసం పోరాడిన లగచర్ల దళిత, గిరిజన, బలహీన వర్గాల రైతులపై అక్రమ కేసులు బనాయించి సంకెళ్లు వేశావు, నేడు బస్తా యూరియా కోసం పొలాలు వదిలి పోలీస్ స్టేషన్లకు వెళ్లి పడిగాపులు కాసే దుస్థితి రైతన్నకు తెచ్చావు, దేశానికి అన్నం పెట్టే రైతులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి నేరస్తులా?, నీ చేతగాని పాలనతో రైతులను అరిగోస పెడుతున్నావు, అన్నదాతలను నడిరోడ్డుకు ఈడ్చి వికృతానందం పొందుతున్నావు, రైతులను పోలీస్ స్టేషన్లో పెట్టి ఎరువుల పంపిణీ చేసే పరిస్థితులు తెచ్చిన నువ్వు చరిత్రహీనుడిగా మిగిలిపోక తప్పదు, రైతులను నేరస్తులుగా పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టిన నీ దుర్మార్గ వైఖరి యావత్ తెలంగాణ సమాజం గమనిస్తున్నది, తగిన సమయంలో బుద్ధి చెబుతుంది ' అని ఆయన ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు.

# రైతులకు సరిపడా యూరియా అందజేయాలి

### కేసీఆర్ అన్న మాటనే నిజమైంది
### రైతుల యూరియా కష్టాలపై
### మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రెస్ మీట్

భీంగల్, సెప్టెంబర్ 13(మనం న్యూస్): ఒక్క సంచి యూరియా కోసం చెప్పులు, పట్టా పుస్తకాలు లైన్లో పెట్టి గంటలు తరబడి నిలబడి రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినా ఒక్క యూరియా బస్తా కుడా దొరకని పరిస్థితి ఉందన్నారు. యూరియా కోసం బీఆర్ఎస్ పార్టీ పక్షాన అసెంబ్లీ లో పోరాటం చేసినా, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కావాలని మొత్తుకుంటున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డి కి దున్నపోతు మీద వాన పడ్డట్టు ఉందన్నారు. రైతులు యూరియా కోసం అరిగోస పడుతుంటే కనీసం ఈ ప్రభుత్వలో చలనం లేదన్నారు. అటు రాష్ట్ర వ్యాప్తంగా మరియు ఇటు బాల్కొండ నియోజకవర్గం లో యూరియా కొరత ఉందన్నారు. బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలం గిరిజన ప్రాంతాల్లో మరియు మోర్తాడ్ మండలం సుంకేట్ గ్రామంలో యూరియా కోసం రాత్రంబవళ్ళు తిండి నిద్రా హారాలు మాని రైతులు పడిగాపులు కాసిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కి ఓటేస్తే పాత రోజులు వస్థాయని కేసీఆర్ ఎప్పుడో అన్నారన్నారు. కేసీఆర్ అన్న మాటనే నిజమైంది అని ఇప్పుడు రైతులు గుర్తు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేసాం అని బాధపడుతున్నారన్నారు. కేసీఆర్ రాకున్నా మొదలు ఏ పరిస్థితులు ఉన్నాయో కాంగ్రెస్ పార్టీ వచ్చాక మళ్ళీ అవే పరిస్థితులు వచ్చాయన్నారు. వరి పొట్ట దశకు వస్తున్నదని, ఈ రెండు మూడు రోజుల్లో యూరియా అందకపోతే దిగుబడి రాదని, రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. మక్కలు పూర్తి కావాచ్చిందని, పసుపు కు పోటాష్, యూరియా కలిపి వెయ్యాలన్నారు. వరికి యూరియా సక్కగా ఇవ్వటం లేదు, మరి పసుపు పరిస్థితి ఏంటన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అనాడు అనేక ఆగం మాటలు మాట్లాడినారన్నారు. మాది రైతు ప్రభుత్వం అని మోసం మాటలు చెప్పారని, కాని ఇది రైతు రాజ్యం కాదు దగా రాజ్యాంగ మారిందన్నారు. 2 లక్షల రుణమాఫీ అన్నారు, రుణమాఫీ పూర్తి గా చేయకుండా రైతులను మోసం చేసారన్నారు.15వేలు రైతు భరోసా అని చెప్పి ఉన్న రైతుబందు ఎగొట్టారన్నారు. వడ్లకు 500 బోనస్ అని చెప్పారని, దాని ఊసే లేదన్నారు. వ్యవసయానికి 24 గంటల కరెంట్ అని చెప్పి రోజు నాలుగైదు సార్లు కోతలు పెడుతున్నారన్నారు. ఒక్క యూరియా బస్తా ఇయ్య చాతకాదు కానీ, లక్ష యాభై వేల కోట్లతో మూసి రివర్స్ ఫ్రంట్ చేస్తా అంటున్నాడని తెలిపారు. రైతులకు ఒక్క యూరియా బస్తా ఇయ్య చేత కాదు కానీ, లక్షల కోట్లతో ఫ్యూచర్ సిటీ కడుత అంటున్నాడన్నారు. రేవంత్ రెడ్డివి అన్ని బుడ్డర్ ఖాన్ మాటలు, లఫంగి మాటలు అన్నారు.



జిల్లా వ్యవసాయ అధికారితో క్షేత్ర స్థాయి ఏవోలతో రిపోర్ట్ తెప్పించుకుంటే, యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయన్నారు. యూరియా కోసం నీలదీస్తే కేంద్ర ప్రభుత్వం పై నెపం నెట్టుతున్నారని, అందరితో కలిసి ఢిల్లీలో ధర్నా చేద్దాం అని బీఆర్ఎస్ పార్టీ పక్షాన మేము వస్తాం అని అసెంబ్లీలో చెపితే మోడీని నిలదీసే ధైర్యం లేదన్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై సమీక్ష చేయడానికి సమయం లేదు కానీ, నిత్యము కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై తిట్టడానికి సమయం ఉందన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లపై కమీషన్ల పేరు మీద, ఎంక్వాయిరీల పేరు మీద, అక్రమ కేసులు పెట్టి ఎట్లా జైల్లో వేద్దామా అన్న ఆలోచన తప్ప రేవంత్ రెడ్డికి రైతుల ఇబ్బందులపై ఆలోచించే శ్రద్ధ లేదన్నారు. హామీల అమలు గురించి అడిగితే కేసీఆర్ అప్పులు చేసిండు అని మాట్లాడుతున్నారన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం గత 10 ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం 2 లక్షల 80 వేల కోట్ల అప్పు మాత్రమే చేసిందన్నారు. కేసీఆర్ చేసిన అప్పుతో మిషన్ భగీరత, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రోడ్లు, బ్రిడ్జి లు, భవనాలు, హాస్పిటల్స్ ఇలా అనేక పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు ఏండ్లలోనే 2 లక్షల 20 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. తట్టేడు మట్టి తీసావా ఎక్కడైన, ఒక్క ప్రాజెక్ట్ కట్టావా, ఒక్క గుంత అయినా పూడ్చావా ఎం చేసావు రేవంత్ రెడ్డి అని తెలంగాణ ప్రజలు అడుగుతున్నారు సమాధానం చెప్పు అని అన్నారు. మహిళలకు 2500 ఏమయ్యాయి, తులం బంగారం ఎక్కడ పోయింది,ఇంట్లో అవ్వ తాత లకు ఇద్దరికీ ఇస్తామన్నా 4000 పెన్షన్ ఏమైందన్నారు. ఇప్పటి కైనా కమిషన్ లు తీసుకునుడు ఢిల్లీకి మూటలు పంపుడు లాంటి పనులు, బుడ్డర ఖాన్ మాటలు మాట్లాడటము అపి పాలనా మీద ద్రుష్టి పెట్టి ఇచ్చిన హామీలు అమలు చేయమని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులకు సరిపడా యూరియా అందజేయాలనీ ప్రభుత్వాని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే రైతులు, మహిళలతో కలిసి ప్రభుత్వం పై పోరాడుతామన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి




**- మరో నిజాం లాగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోయారు**

**- అధికారికంగా నిర్వహించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం**

**- లింగంపేట మండల బీజేపీ అధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్ డిమాండ్**

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 13(మనం న్యూస్): ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండల బీజేపీ అధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మండల బీజేపీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., తెలంగాణ పేరుమీద పార్టీ పెట్టి 9ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించకుండా మరో నిజాం లాగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలిచి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేకపోయిందని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడినటువంటి మాటలను, ఇప్పుడు మర్చిపోయారా..? ఆనాడు కేసీఆర్ను వ్యతిరేకించినటువంటి రేవంత్ రెడ్డి, ఈరోజు సీఎం అయ్యుండి కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారింగా ప్రకటించే చిత్తశుద్ధి లేకుండా పోయిందా..? అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసే ప్రభుత్వాలే అని, ప్రాంతీయ తత్వాన్ని మరిచి కేవలం రాజకీయ పబ్బం కోసం మాత్రమే నిజాం తత్వాన్ని బయట పెట్టకుండా, మాట్లాడకుండా ప్రభుత్వాలు ఉండడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మీకు రాజకీయ సమాధానం చెప్పడానికి ప్రజలు తెలంగాణలో సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జక్సని దత్తు, రాములు, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచంద్ర చారి, బీజేవైఎం మండల అధ్యక్షులు మార్గం రజనీకాంత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ఆంధ్యాల ఉదయ్, మండల ప్రధాన కార్యదర్శులు ఆకుల విష్ణువర్ధన్, మార్గం సుభాష్, లింగంపేట పట్టణ అధ్యక్షులు తిరుమల నరేష్, మండల సీనియర్ నాయకులు చేపూరి పోశెట్టి, బీజేపీ మాజీ అధ్యక్షులు వడ్ల ఎల్లేశం, మోతే మల్లయ్య, బూత్ అధ్యక్షులు సంతోష్, బొల్లు గణేష్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎల్లారెడ్డిలో మెగా రక్తదానశిబిరం

**- రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపు**

**- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ): రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమాద్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో నేడు మెగా రక్తదాన శిబిరాన్ని ఎల్లారెడ్డి మైనారిటీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి గయాజీద్దిన్ మరియు సభ్యుల సహకారంతో స్థానిక మైనారిటీ



ఫంక్షన్ హాల్లో  నిర్వహించనున్నట్లు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు జమీల్ హైమాద్ లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేసే వారికి గుండె జబ్బు, క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని సర్వేల్లో వెల్లడి కావడం జరిగిందని పేర్కొన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని, యువత రక్తదానానికి ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# సే నో టు డ్రగ్స్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలి

**- మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి**

**- ఏఐపీఎస్యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్**




బోధన్ టౌన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్) : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఏఐపీఎస్యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్ సూచించారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్యు) రాష్ట్రవ్యాప్తంగా సే నోటు డ్రగ్స్ అనే అంశంపై సెమినార్లు నిర్వహిస్తున్నట్లు శనివారం వారు పత్రిక ప్రకటనను విడుదల చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కలిగిస్తూ ఉద్యమాలు చేపడుతున్నామని ఏఐపీఎస్యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఐపీఎస్యు విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న సే నోటు డ్రగ్స్ క్యాంపెయిన్లో భాగంగా బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు ఈనెల 15న ఉదయం 11 గంటలకు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త, రాష్ట్ర కార్యదర్శి మన్నే కుమార్, బోధన్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్, బోధన్ పట్టణ సీఐ హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో హాజరై సెమినార్ను విజయవంతం చేయాలని  కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐపీఎస్యు విద్యార్థి సంఘ నాయకులు రామ్, శ్రీకాంత్, ఆకాష్, నవీన్, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపేట్ మండలానికి గ్రామ పరిపాలన అధికారుల నియామకం

నాగిరెడ్డిపేట్,  సెప్టెంబర్ 13 ( మనం న్యూస్)::  నాగిరెడ్డిపేట్ మండలానికి 18 గ్రామాలకు12 మంది గ్రామ పరిపాలన అధికారులు విధుల్లో చేరినట్లు మండల తాసిల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

# క్షయ రోగులకు పోషకాహార సరుకుల పంపిణీ

బోధన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): బోధన్ నియోజకవర్గం సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిక్షయ్ పోషణ యోజన కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషక విలువలతో కూడిన సరుకులను మండల వైద్య అధికారి డాక్టర్ రాజ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా  ఆయన మాట్లాడుతూ., మండలంలో 9 మంది క్షయ వ్యాధి బాధితులు ఉన్నారని తెలిపారు. వారిని దత్తత తీసుకొని ప్రతి నెలా రూ.500 విలువైన సరుకులను అందజేస్తున్నట్లు చెప్పారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయించుకుంటే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని డాక్టర్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. రోగులు వైద్యుల సూచనలు పాటిస్తూ, సమయానికి మందులు వాడుతూ, పోషకాహారం తీసుకుంటే ఏ వ్యాధినైనా జయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ ఎస్టిఎల్ఎస్ హాసన్, సూపర్వైజర్లు సాయికుమార్, సత్యం, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, టీబీ బాధితులు పాల్గొన్నారు.



# ఫోటో స్టూడియో అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

బోధన్ టౌన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): బోధన్ పట్టణకేంద్రంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో బోధన్ టౌన్ ఫోటో స్టూడియో అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సీఐ వెంకటనారాయణ, నిజామాబాద్ ఫోటోగ్రాఫర్స్ ఇన్చార్జ్ ప్రెసిడెంట్ వేముల శ్రీనివాస్ హాజరైయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా అనిల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, భాస్కర్, శ్యామ్, కోశాధికారిగా ఉమాకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ సభ్యులు మధు సహా పలువురు పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ పట్టణంలోని ఫోటో స్టూడియోల అభివృద్ధి దిశగా కృషి చేస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు



# ఆర్థిక సహాయాన్ని అందజేసిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

- ఆపన్న హస్తం అందించి మానవత్వాన్ని చాటుకున్న వైనం
- మెరుగైన వైద్యం కోసం వైద్యులకు ఫోన్



కామారెడ్డి టౌన్, సెప్టెంబర్13 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ నసీరుద్దీన్ కుటుంబం ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను గమనించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. పట్టణానికి చెందిన మహమ్మద్ నసీరుద్దీన్ ఇటీవల పాల్వంచ గ్రామంలో హౌస్ ఎలక్ట్రిషన్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై చేతి వేళ్లకు తీవ్ర గాయాలు కావడంతో నెల రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. అయితే పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ముందడుగు వేసి సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. నేనున్నానంటూ ఆపన్నహస్తం అందించారు. వైద్యులతో మాట్లాడి బాధితునికి అవసరమైన వైద్య సేవలు తక్షణమే సమకూరేలా చూడాలని కోరారు. కాగా, బాధిత కుటుంబానికి అండగా నిలిచినందుకు కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ, పిడుగు మమత, సాయిబాబా, పంపరి లత, శ్రీనివాస్, బాధిత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



## నేడు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): నేడు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. ఉదయం 11గంటలకు కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హై స్కూల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సదాశివనగర్, తాడ్వాయి, రామారెడ్డి, రాజంపేట మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను దేవునిపల్లిలోని లక్ష్మీదేవి గార్డెన్స్ లో అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చిన చెక్కులను ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేస్తారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## వర్షపు నీటితో జలమయమవుతున్న కాలనీ

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకుంటున్న కాలనీవాసులు



బోధన్ టౌన్, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ): బోధన్ పట్టణంలోని 6వ వార్డ్ లోని దారిపై నడవలేని స్థితిలో ఉన్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతుందని, రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొందని, పిల్లల స్కూలుకు వెళ్లడానికి ఆటో వాళ్ళు కూడా కాలనిలోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడ్డప్పుడు ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదని, ఒక ఆటో కూడా కాలనీలో రావట్లేదని, కిలోమీటర్ దూరంలోనే ఆటో వాళ్ళు వదిలిపెడుతున్నారని తెలిపారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి నీళ్లు నిండడంతో రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉండడంతో పాటు పాములు సైతం పురుగుల కోసం ఇండ్లలో వస్తున్నాయని, చిన్న పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మురికి నీరు, వర్షం పడిన నీరు రోడ్డుపై కలిసిపోవడంతో నడవడానికి ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని రోడ్డుపై మొరం వేయించాలని, మురికి కాలువలు ఏర్పాటు చేయాలని, సమస్యను తీర్చి కాలనీవాసులకు తగిన న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా కాలనీవాసులు కోరుతున్నారు.



# మనం ఎఫెక్ట్

## చెత్త ఎత్తరు... అధికారులు పట్టించుకోరు కథనానికి స్పందన

- చెత్తను తొలగించిన అధికారులు

బోధన్, సెప్టెంబర్ 13(మనం న్యూస్): 'చెత్త ఎత్తరు.. అధికారులు పట్టించుకోరు' అనే శీర్షికతో మనం పత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వెంటనే పంచాయతీ కార్మికులతో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ట్రాక్టర్ల సహాయంతో చెత్తను ఎత్తివేసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ చర్యతో గ్రామ ప్రజలు ఉపశమనం పొందారు. 'మనం దినపత్రిక'లో ప్రచురితమైన వార్తపై ఎఫెక్ట్ వచ్చి పరిసరాలు శుభ్రం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



చెత్త ఎత్తరు... అధికారులు పట్టించుకోరు!

## దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళల అరెస్ట్

కోటగిరి, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ): దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెలలో పోతంగల్ మండల కేంద్రంలో జరిగిన దొంగతనాలలో అనుమానితులుగా తిరుగుతూ ఉన్న ఇద్దరు మహిళలను కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం పట్టుకుని విచారించారు. దీంతో వారు నేరం ఒప్పుకోవడంతో, వారిద్దరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారి వద్ద నుంచి 6.9 గ్రాముల బంగారం, 44.51 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోతంగల్ గ్రామానికి చెందిన మొండి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వారిని బోధన్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

# దారి ఇలా.. నడిచేది ఎలా...?

బోధన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): బోధన్ నియోజకవర్గం సాలూర మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం నుండి నూతన కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది.. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా రహదారి మొత్తం బురదతో నిండిపోవడంతో రోడ్డు వెంట నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవసోపాలు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో తక్షణ మరమ్మతులైనా చేపట్టి సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



**దారికి కనీస మారమ్మతులు చేయండి**



భారీ వర్షాలు మొదలైన నుండి ఇదే పరిస్థితి. దారి గురించి పట్టించుకున్న వారు లేరు. రాత్రిపూట ఇంటికి వెళ్లాలంటే ఈ దారిలోనే వెళ్లాలి చీకట్లో ఆ బురదలో ఎక్కడ పడిపోతామో అని భయపడుతున్నాము. మా పరిస్థితి ఇలా ఉంటే చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులు ఆలోచించాలి. కనీసం దారికి మరమ్మత్తులు చేసి సాఫీగా నడిచేటట్లు చేయాలని అధికారులను కోరుతున్నాం.
**సుభాష్, కాలనీవాసి.**

# మనసుకవి ఆచార్య ఆత్రేయకు ఘన నివాళి

- చిన్న చిన్న పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాటి
- శ్రీ రాఘవేంద్ర ఆర్ట్స్అండ్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కంకణాల రాజేశ్వర్



భీంగల్, సెప్టెంబర్ 13( మనం న్యూస్): చిన్న చిన్న పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాటి అని శ్రీ రాఘవేంద్ర ఆర్ట్స్అండ్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కంకణాల రాజేశ్వర్ పేర్కొన్నారు. పాటల మాంత్రికుడు, సినీ వేమన, మనసు కవి, తత్వవేత్త, కవి, రచయిత, నిర్మాత, సినీ దర్శకుడు, జమీన్ రైతు పత్రిక అసిస్టెంట్ డైరెక్టర్, నాటిక, నాటక, సినిమా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఆచార్య ఆత్రేయగా సినీ రంగ ప్రవేశం చేసిన కిలాంబి వెంకట నరసింహాచార్యులు 69వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత శ్రీ రాఘవేంద్ర ఆరట్స్ అండ్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కంకణాల రాజేశ్వర్ ఆచార్య ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కంకణాల రాజేశ్వర్ మాట్లాడుతూ., మనసుకవి ఆత్రేయ 1921 మే 7న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట మండలంలో గల మంగళంపాడు గ్రామంలో జన్మించాడని తెలిపారు. తండ్రి కృష్ణమాచార్యులు, తల్లి సీతమ్మ అని తెలిపారు. ఆత్రేయ చిన్నప్పటినుండి నాటకాల్లోని పద్యాలను రాగయుక్తంగా చదివేవారని ప్రశంశించారు. సమాజంలోని మధ్యతరగతి కుటుంబ సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని మనోహరమైన నాటకాలుగా మలిచి, 1400 సినిమాలకు మాటలు, పాటలు రాసిన కవి అని పేర్కొన్నారు. తెలుగు సినిమా గేయ రచయిత, సంభాషణ కర్త, మనసుకవిగా సినిమా వారు పిలుచుకునే ఆత్రేయ నాటకాల్లో చక్కని ప్రయోగాలు చేసి నాటక రంగాన్ని మలుపు తిప్పారన్నారు. నంది అవార్డు గ్రహీత, ఉత్తమ గేయ రచయిత, గౌరవ డాక్టరేట్, 1951లో సినీరంగ ప్రవేశం చేశారన్నారు. ఆయన రాసిన పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండడం వలన మనసుకవి, మన'సు'కవి అయ్యాడని కంకణాల రాజేశ్వర్ అన్నారు.13 సెప్టెంబర్ 1989లో ఆత్రేయ మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలువేరి రమేష్, కండక్టర్ నర్సయ్య, కేశపురం సుమన్, పిట్టల సందీప్, బొమ్మడి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# రూ.5.26 లక్షల బీమా చెక్కు అందజేత

బోధన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): కేవలం ఒక సంవత్సరం ప్రీమియం చెల్లింపుతో బీమా మొత్తాన్ని బోనస్తో సహా పొందడం ఒక్క పోస్టల్ ఇన్సూరెన్స్ లోనే సాధ్యమని బోధన్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ పోస్ట్ జాదవ్ ప్రకాష్ అన్నారు. మిర్జాపూర్ గ్రామంలో సల్ఫిడి హనుమాండ్లు పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకున్నారు. ఇటీవల హనుమాండ్లు మృతిచెందగా.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసి ఉండటంతో ఆయన భార్య సల్పిడి జయశ్రీ నామినీగా ఉన్నందున రూ.5లక్షల 26 వేల రూపాయల భీమా క్లైమ్ చెక్కును గ్రామస్తుల సమక్షంలో ఆమెకు అందించారు. ఈ సందర్భంగా జాదవ్ ప్రకాష్ మాట్లాడుతూ., పోస్టల్ శాఖ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా, ఆరోగ్య భీమా, లాంటి పథకాలను ప్రజలకు విరివిగా అందిస్తుందన్నారు. అతి తక్కువ ప్రీమియంలో అందుబాటులో ఉన్న పథకాలను ప్రజలు వినియోగించుకొని ప్రయోజనాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుద్ధి గంగాధర్, యంవోలు రూపేష్, సూర్యకాంత్, చంద్రశేఖర్, జెట్టి, పోస్టల్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రయివేట్ విద్యాసంస్థలను రెండో శనివారం కొనసాగించడం విడ్డూరం

- విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమలు తప్పవు.
- పీడీఎస్యూ జిల్లా అధ్యక్షులు ఎన్. బాలరాజ్ డిమాండ్.

కామారెడ్డి, సెప్టెంబర్ 13 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లాలో ప్రయివేట్ విద్యాసంస్థలను రెండో శనివారం కొనసాగించడం విడ్డూరమని, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమలు తప్పవని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) జిల్లా అధ్యక్షులు ఎన్.బాల్రాజ్ శనివారం డిమాండ్ చేస్తూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ డివిజన్లోని పలు మండల కేంద్రాలల్లో ప్రయివేట్ విద్యాసంస్థలు రెండవ శనివారం యదావిధిగా కొనసాగాయన్నారు. విద్యార్థులకు, ప్రభుత్వ అధికారులకు సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించి ఆచరణలో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కానీ.. ప్రయివేట్ రంగ విద్యాసంస్థలు ప్రభుత్వాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ఒంట్టేద్దు పోకడలు కొనసాగిస్తూ ముందుకెళ్తున్నాయన్నారు. రెండవ శనివారం ప్రయివేట్ విద్యాసంస్థల తీరు మారకపోవడం, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నందున విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ సెలవు దినం రోజు కొనసాగిస్తున్న సదరు ప్రయివేట్ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తదుపరి కార్యాచరణలు కొనసాగుతాయాని ఈ సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన ద్వారా హెచ్చరించారు.








# సైబర్ నేరాలపై పోలీసు కళాబృందంచే అవగాహన

కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 13(మనం న్యూస్): కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు శనివారం కామారెడ్డి బస్టాండ్ ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై పోలీసు కళాబృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలకు మోసపోకుండా ఉండేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1930 కు సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ హెల్ప్లైన్ నంబర్ 8712686094, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని ప్రజలకు తెలియజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్, గంజాయి-డ్రగ్స్ వాడకం వంటి వాటి వల్ల యువత జీవితాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులను అరికట్టే బాధ్యత అందరిదని గుర్తు చేశారు. యువత తల్లి తండ్రుల మాట వినడం, వారిని గౌరవించడం, అలాగే సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సందేశాన్ని సులువుగా అందించేందుకు పోలీస్ కళాబృందం ఇన్చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, యు. శేషారావు, పిసి ప్రభాకర్, సాయిలు పాటలు, సంభాషణల ద్వారా సాధారణ ప్రజలు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన ప్రయాణికులు పోలీస్ శాఖను అభినందించారు.

# పోచారం మెయిన్ కెనాల్ మరమ్మత్తులు

నాగిరెడ్డిపేట సెప్టెంబర్ 13( మనం న్యూస్ ): గత కొన్ని రోజులు క్రితం కురిసిన భారీ వర్షాల కారణంతో మండలంలోని నాగిరెడ్డిపేట్ పటేల్ చెరువు పూర్తిగా ధ్వంసం అయినందున పనులు చేపట్టడం జరుగుతుందని డి ఈ వెంకటేశ్వర్లు తెలిపారు





## ఎంపీ అరవింద్‌ను కలిసిన భీంగల్ మోర్చా మండల నూతన అధ్యక్షులు

భీంగల్, సెప్టెంబర్ 13( మనం న్యూస్): భీంగల్ మండల భారతీయ జనతా పార్టీ యువ మోర్చా మండల నూతన అధ్యక్షులుగా నియమితులైన శెట్టి ప్రేంచంద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాదులోని ఆయన నివాసంలో భీంగల్ బీజేపీ మండల అధ్యక్షులు ఆరే.రవీందర్ ఆధ్వర్యంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భీంగల్ మండలంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుకుగా తీసుకెళ్తున్నారని అభినందిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, మండలంలో ఇంకా పార్టీని బలోపేతం చేయాల్సిందిగా ఎంపీ ధర్మపురి అరవింద్ సూచించినట్లు ఆరే రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఓరగంటి కిషన్, మండల ప్రధాన కార్యదర్శి బిర్రు రామకృష్ణ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## వేముగంటి మురళీకృష్ణకు ధర్మనిధి సాహిత్య పురస్కారం లభించడం అభినందనీయం

**అస్మక చరిత్ర పరిశోధక మండలి ప్రధాన కార్యదర్శి, కంకణాల రాజేశ్వర్**

భీంగల్, సెప్టెంబర్ 13( మనం న్యూస్): తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి గాను ధర్మనిధి సాహితీ పురస్కారాలను ప్రకటించింది. అట్టి పురస్కారాలలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం నిర్వాహకులు వేముగంటి మురళీకృష్ణ ఎంపికవ్వడం హర్షించదగినదని అస్మక చరిత్ర పరిశోధక మండలి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల రాజేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ., ధర్మనిధి పురస్కారాన్ని సెప్టెంబర్ 18న అబిడ్స్ తిలక్ రోడ్డు లోని బొగ్గులకుంటలో గల దేవులపల్లి రామానుజారావు కళామందిరం వేదికగా సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో గురువారం ధర్మనిధి 2025 సాహిత్య పురస్కారాన్ని వేముగంటి మురళీకృష్ణ స్వీకరించనున్నారని అన్నారు. వేముగంటి సాహిత్య కృషిని గుర్తించినందుకు నిర్వాహకులకు కంకణాల రాజేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతశిశువు జననం

- కామారెడ్డిలో కలకలం రేపిన ఘటన
- వైద్యులతో వాగ్వాదానికి దిగిన బాధిత కుటుంబ సభ్యులు
- ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి చెందిందని స్పష్టం చేసిన వైద్యులు



కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతశిశువు జన్మించడం కలకలం రేపింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి గ్రామానికి చెందిన అఖిలకు శుక్రవారం అర్ధరాత్రి పురిటినొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను జిజిహెచ్ కామారెడ్డి తీసుకొచ్చారు. మొదటి కాన్పు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది, నొప్పులు భరించలేకపోతుందని ఆపరేషన్ చేయాలని వేడుకున్నామని తెలిపారు. అయినప్పటికీ, మొదటి కాన్పు కావడంతో వైద్యులు సాధారణ ప్రసవం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. తాము ఎంత వేడుకున్నా సాధారణ ప్రసవం వైపే వైద్యులు మొగ్గుచూపి కాన్పు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుట్టడంతో మహాలక్ష్మి పుట్టిందని సంతోషించే లోపే, మృత శిశువు జన్మించిందని వైద్యులు చెప్పడంతో అర్ధరాత్రి బాధిత కుటుంబ సభ్యులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. తాము చెప్పినట్లు ఆపరేషన్ చేస్తే బిడ్డ బతికేదని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ కడుపులోనే మృతి చెందిందని మండిపడ్డారు.

**ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి: ఆసుపత్రి సూపరింటెండెంట్**

ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ను వివరణ కోరగా.. ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి చెందిందని, ప్రసవం సమయంలో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

కామారెడ్డి, సెప్టెంబర్ 13 ( మనం జిల్లా ప్రతినిధి ): మొఘు, మద్నూర్ మార్గమధ్యలో బ్రిడ్జి కూలిపోయిందని, గత పాలకుల వల్ల గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఎంసి వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మూడు రోజులలోనే బ్రిడ్జి, ఒక కల్వర్ట్ నిర్మాణానికి 30 లక్షలు మంజూరు చేయడం, గ్రామానికి 35 లక్షలతో సీసీ రోడ్డు, 10 లక్షలతో మురికి కాలువల కోసం గ్రామానికి నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చిత్రపటాలకు మొఘు గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. గ్రామ ప్రజలకు అండగా ఉంటూ, పనులు చేయించే ఇలాంటి ఎమ్మెల్యే రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాయకులు పరమేష్ పటేల్ మాట్లాడుతూ., మాజీ ఎమ్మెల్యే హన్మంత్



షిండేపై విరుచుకు పడ్డారు. గత 15 సంవత్సరాలుగా మొఘు నుండి మద్నూర్ వెళ్లే దారికి బీట్ రోడ్ వేసి ఓట్లు అడుగుతా అని మాయమాటలు చెప్పి ఓట్లు వేసుకున్న హన్మంత్ షిండేకి జుక్కల్ ప్రజలు గద్దె దించారని తెలిపారు. గత 10 రోజుల క్రితం నుండి మొఘు గ్రామంలోని కొందరికి కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఒక్కరినైనా ఒక గ్రామం పంచాయతి మెంబెర్గా గెలిపించి చూపిస్తే తన ఏఎంసి వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.



## బడా భీంగల్ పెద్ద చేరువు అలుగుపై నుండి పారుతున్న వరద నీరు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

భీంగల్, సెప్టెంబర్ 13( మనం న్యూస్): భీంగల్ మండలంలో భారీ వర్షం కురుస్తుంది. వాయుగుండం ప్రభావంతో పలు చోట్ల కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. కాలనీల్లోని రోడ్లు, ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వరద ప్రభావంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. నైరుతి రుతుపవనాల్ని ఆహ్వానించేలా వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకూ ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఈ వర్షాలు ఊరటనిస్తున్నాయి. భారీగా కురిసిన వర్షనికి భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామంలో ఉన్నటువంటి సింగిడి చెరువు, పెద్ద చెరువుల అలుగుపై నుండి వరద నీరు పొంగిపొర్లుతుంది. వరద నీరు పొంగిపోర్లడంతో ఆనందంలో రైతన్నలు ఉన్నారు. వరదలు ఉదృతంగా ప్రవహిస్తున్న వేల ఎవరు కూడా చేపల వేటకు ప్రాజెక్టులు, చెరువులు, నదులలో వెళ్లకుండా కట్టడి చేయాలని అధికారులు తెలియజేశారు .శనివారం, ఆదివారం సెలవు దినమైనందున విద్యార్థులు, యువకులు ఈత సరదా కోసం చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా నిలువరించాలని అధికారులు సూచించారు. రానున్న గంటలలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారిచేసింది.

